క్లుప్తంగా

వైభవంగా లింగాష్టక పూజలు



గుడివాడ టౌన్: స్థానిక గౌరీశంకరపురంలో గౌరీశంకర స్వామి దేవస్థానం (చిన్న శివాలయం)లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేణుగోపాలరావు మాట్లాడుతూ కార్తిక మాస శుభ దినాలను పురస్కరించుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని లింగాష్టకం, కుంకుమ పూజ నిర్వహించామన్నారు. పవిత్ర దినాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్చకులు చందు బృందం ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

విద్యార్థికి ఆర్థిక సాయం



పామర్రు(తోట్లవల్లూరు): మండల పరిధిలోని గరికపర్రు గ్రామానికి చెందిన దాత బొమ్మారెడ్డి వెంకటరెడ్డి నిరుపేద కుటుంబానికి చెందిన లుక్కా కార్తీక్ అనే పేద విద్యార్థి చదువు నిమిత్తం శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. కార్తీక్ ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవతసరం చదువుతున్నాడు. పరీక్షలకు ఫీజు చెల్లించాలని సాయం చేయమని వెంకటరెడ్డిని కోరగా తక్షణమే స్పందించి రూ.22 వేలు సాయం చేశారు. ఈ నగదును పరీక్ష ఫీజుగా బీవీఆర్ యూత్ సభ్యుల సమక్షంలో కార్తీక్‌కు అందజేశారు. స్థానికులు వెంకటరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ యూత్ ప్రెసిడెంట్ శ్యామ్, సెక్రటరీ సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం



కైకలూరు: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కైకలూరు మండలం సీతనపల్లిలో పంచాయతీ నూతన భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎన్‌డీఏ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నమయ్య గళార్చనకు ఎంపిక



చోరగుడి రూప

గుడివాడ టౌన్: గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జరగనున్న అన్నమయ్య సహస్ర గళార్చనకు పట్టణానికి చెందిన చోడవరపు రూప ఎంపికయ్యారు. పలు రాష్ట్రాల నుంచి గాయనీ గాయకులు పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి గుడివాడకు చెందిన రూప ఎంపిక కావడంపట్ల పలువురు కళాకారులు, గాయకులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఏడు ఎకరాల చెరకు తోట దగ్ధం

రూ.7 లక్షల ఆస్తినష్టం

పమిడిముక్కల: మండలంలోని మంటాడ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఫైర్ స్టేషన్ రోడ్డులోని చెరువు వద్ద ఏడు ఎకరాల చెరకు మొక్క తోట దగ్ధమైంది. కోడెబోయిన లక్ష్మికి చెందిన ఐదు ఎకరాలు, మేరుగ వెంకటేశ్వరావుకు చెందిన రెండు ఎకరాల తోట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.7 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఉయ్యూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఫిల్టర్‌బెడ్ పనుల పరిశీలన



మండవల్లి: మండవల్లి మొగలి చెరువు వద్ద మైక్రోవాటర్ ఫిల్టర్ బెడ్ పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయడానికి ఫిల్టర్ బెడ్ అతి ముఖ్యమైనదన్నారు. ఈ కారణంగా ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయించి స్వచ్ఛమైన తాగునీరు అందజేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

వర్షంతో వరి రైతుల వర్రీ



అంగలూరులో నేలవాలిన వరిచేను





చంద్రాలలో సంచులలో ధాన్యాన్ని నింపి కుడుతున్న ముఠా కూలీలు

గుడ్లవల్లేరులో వర్షంలో ధాన్యాన్ని కాపాడుకునేందుకు తిప్పలు

వాయుగుండం ప్రభావంతో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో రైతులు పరదాలు పట్టుకుని పొలాల వైపు పరుగులు తీశారు. అప్పడే నూరుస్తున్న వరి కుప్పలపై పరదాలు కప్పుకున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు తలమునకలయ్యారు. రోడ్డు వెంబడి పోసిన ధాన్యంపై హడావుడిగా పరదాలు కప్పుకున్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించేందుకు బస్తాలను గబగబా నింపారు. మిల్లుల కల్లాల్లో సైతం వర్షానికి బస్తాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. నేలవాలిన వరిచేలపై వర్షం కురుస్తూనే ఉండటంతో రైతన్నలు ఆవేదనకు గురయ్యారు. –గుడ్లవల్లేరు



వడ్లమన్నాడులో వరికుప్పపై పరదాలు కప్పుతున్న కూలీలు



చంద్రాలలో ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు



గుడ్లవల్లేరు రైస్ మిల్లులో చిరుజల్లులకు తడుస్తున్న ధాన్యం బస్తాలు

రైతులకు న్యాయం చేయకపోతే పోరాటం తప్పదు

- ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(తోట్లవల్లూరు): రైతులకు ధాన్యం కొనుగోళ్లలో అన్యాయం జరిగితే వైఎస్సార్ సీపీ తరఫున పోరాటాలు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక గ్రామాలలో రోడ్లపై ఆర బోసిన ధాన్యం రాశులను రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రైతులను ఇబ్బంది పెట్టింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆరోపించడాన్ని తప్పు బట్టారు. ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని అన్నారు.

ప్రభుత్వ అండతోనే మిల్లర్ల హవా

కూటమి ప్రభుత్వం అండతోనే మిల్లర్లు హవా సాగిస్తున్నారని అన్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు 1262 రకం వరి విత్తనాలను సాగు చేశారు. మిల్లర్లు ఈ వరి విత్తనం కొనుగోలు చేసేది లేదనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలుచేసే విధంగా మిల్లర్లకు ప్రభుత్వం సత్వరమే ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకోవాలని కోరాం..

ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకి కనీస మద్దతు ధర లభించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. రైతులకు న్యాయంజరగకపోతే ధర్నాలు చేస్తామన్నారు. ఉయ్యూరు, గుడివాడ, గన్నవరం, తదితర ప్రాంతాలలో ఏ గ్రేడ్ బస్తా ధాన్యాన్ని రూ.1,400, పామర్రు, అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన ప్రాంతాలలో రూ.1,300కి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీని ప్రకారం గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రైతులు ఒక్కో బస్తాకు రూ.700 నుంచి 800 వరకు నష్టపోతున్నారని చెప్పారు. రైతులకు నష్టం జరిగితే ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్లం వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, చింతలపూడి గవాస్కరరావు, గంగా భవాని, ఆరేపల్లి రాము, బడుగు శంకర్, బాకీ కోటేశ్వరరావు, ఆయా గ్రామాల రైతులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



లక్ష మారేడు బిల్వాలతో పూజలు చేస్తున్న దృశ్యం



కూచిపూడిలో లక్షపత్రి పూజ చేస్తున్న భక్తులు

పామర్రు: స్థానిక గంగా పార్వతీ సమేత శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం మాసశివరాత్రి శుక్రవారం పురస్కరించుకుని బ్రాహ్మణ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన ఘనంగానిర్వహించారు. తొలుత బిందె తీర్థంతో కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామికి విశేషంగా నమక చమకాలతో మహా రుద్రాభిషేకాలను చేశారు. లక్ష మారెడు బిల్వాలతో అర్చన పూజ కార్యక్రమం చేశారు. ఆలయ ప్రాంగణంలోని అమ్మవారికి లలితా సహస్ర నామ పారాయణ కుంకుమపూజను వైభవంగా జరిపారు. నీరాజన మంత్రపుష్పాలు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం అనంతరం వచ్చిన భక్తులకు స్థానిక చావలి వెంకటేశ్వరరావు నివాస గృహంలో కార్తిక మాస వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు భేతన బొట్ల ఫణి కిషోర్‌శర్మ, బి.సుబ్బారావు, ఆర్‌కే విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి(మొవ్వ): మండలంలోని కూచిపూడి శ్రీ గంగా బాలా త్రిపుర సుందరీసమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం రామలింగేశ్వరునికి అభిషేకాలు, బిల్వార్చన నిర్వహణలతో ఆధ్యాత్మిక శోభతో విరజిల్లింది. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘం, ఆలయ పాలకమండలి కమిటీ, అర్చకులు, నిర్వహించిన పూజా కార్యక్రమాలను పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు తిలకించారు. త్రయోదశి సందర్భంగా దేవాలయంలో పరమేశ్వరునికి అన్నాభిషేకం, నందీశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు.

విద్యార్థినులకు భద్రతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఎన్.చంటిబాబు

గుడివాడరూరల్: విద్యార్థినుల భద్రతపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎస్‌ఐ చంటిబాబు శుక్రవారం సాయంత్రం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, లైగింగ దాడులకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో విద్యార్థి దశ నుంచి విద్యార్థినులు అవలంభించాల్సిన తీరుపై వారికి ఉపాధ్యాయుల ద్వారా అవగాహన కల్పించేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని కోరారు. చెడు ప్రవర్తనకు దూరంగా, మంచి ప్రవర్తనతో విద్యార్థినులు ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమావేశంలో ఎంఈవో బాలాజీ, ప్రధానోపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



గుడివాడరూరల్: తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ గుడివాడ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ అధినేతను కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు పార్టీ అండదండగా ఉంటుందని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్టు విక్టర్ తెలిపారు.

కులధ్రువీకరణ పత్రంపై విచారణ



మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లీశ్వరి, పక్కన ఈవోపీఆర్డీ బాషా

నందివాడ: మండలంలోని తమిరిశ గ్రామ సర్పంచి ఎన్నికల సమయంలో సమర్పించిన కులధ్రువీకరణ పత్రంపై అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. తమిరిశ గ్రామ సర్పంచి తప్పిట ధనలక్ష్మి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంపై పోటీ చేశారని ఆమెపై పోటీచేసి ఓడిపోయిన కారె వెంకట రమణమ్మ వారం రోజుల కిందట ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తమిరిశ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ బాషా విచారణ నిర్వహించారు. ఫిర్యాదు దారురాలు కారే వెంకట రమణమ్మ నుంచి సర్పంచ్ వాస్తవ కులానికి సంబంధించిన పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లీశ్వరి మాట్లాడుతూ కారే వెంకటరమణమ్మ, ప్రస్తుత సర్పంచ్ తప్పిట ధనలక్ష్మి కులం రికార్డుల్లో బీసీ సీగా ఉన్నట్లు ఆరోపించారని తెలిపారు. బీసీ.సీ అయిన ధనలక్ష్మి ఎస్సీ కోటాలో సర్పంచ్‌గా పోటీ చేసే అర్హత లేదని ఫిర్యాదు చేశారన్నారు. ప్రస్తుత సర్పంచ్ తప్పిట ధనలక్ష్మి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టాం. ఇరువర్గాల నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను స్వీకరించాం. ఫిర్యాదుదారుడు అందించిన స్కూల్ రికార్డులను పరిశీలిస్తాం. రెవెన్యూ కార్యాలయం నుంచి జారీ అయిన సర్పంచ్ కుల ధ్రువీకరణ పత్రంపై తహసీల్దార్ నివేదిక కొరతాం. విచారణ పూర్తి నివేదిక కలెక్టర్‌కు అందించిన తర్వాత, కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారని ఎంపీడీవో తెలిపారు.

శిథిలావస్థకు చేరిన వంతెన

ఈదులమద్దాలి(పెదపారుపూడి): మండలంలోని ఈదులమద్దాలి పొలిమెరలో వద్ద ఉన్న చంద్రయ్య డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. కూలేందకు సిద్ధంగా ఉండటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగా వంతెన మధ్యలో కుంగి పోయింది. శ్లాబ్ కింద పెచ్చులు ఊడి ఇనుప సువ్వలు బయటకు కనబడుతున్నాయి. గుడివాడ నుంచి విజయవాడకు ఎక్కువగా వాహనాలు వెళ్లుతుండటంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.7.85 కోట్లతో అంచనా



రోడ్డు నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కామినేని

మండవల్లి: పెనుమాకలంక నుంచి పెదయెడ్లగాడి వరకు రోడ్డు అభివృద్ధికి రూ.7.85 కోట్ల నిధులు అవసరమవుతాయని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శుక్రవారం అంచనా వేశారు. ఇంగిలిపాకలంక నుంచి పెనుమాకలంక మీదుగా పెద ఎడ్లగాడి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను 28వ తేదీన కలిసి రోడ్డు దుస్థితిని వివరించారు. కామినేని ఆర్ అండ్‌బీ మంత్రి, అధికారులతో మాట్లాడి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ పెదయెడ్లగాడి నుంచి పెనుమాకలంక వరకు మూడున్నర కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మించి, పెనుమాకలంక నుంచి ఇంగిలిపాకలంక వరకు తారు రోడ్డు వేస్తారన్నారు. రోడ్డు పనులు నాలుగు రోజుల్లో మొదలు పెట్టి నాలుగు నెలల్లో పూర్తి చేస్తారన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరాలు

గుడివాడ టౌన్: పట్టణంలో ఆదివారం రెండు వేర్వేరు ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్ ఆవరణలో రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సహకారంతో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యబృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ప్రోగ్రామ్ కన్వీనర్ సి. సూర్యచంద్ర రావు శుక్రవారం తెలిపారు.

ఏఎన్నార్ కళాశాలలో..

స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. విజయవాడకు చెందిన పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యబృందంచే గుండె, మెదడు, నరాలు, కిడ్నీ, ఎముకలు, కళ్లు, చెవి, ముక్కు, గొంతు తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని నిర్వాహకులు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశ రుద్రాభిషేకం

ముదినేపల్లి రూరల్: పెదపాలపర్రు శివాలయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్తికమాసంలో అమావాస్య ముందు వచ్చే చతుర్థశి తిథిని పురస్కరించుకొని రుద్రాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అర్చకుడు హనుమానశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్రాభిషేకం ననిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మండలంలోని చినకామనపూడి మహంకాళేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



గుడివాడ టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మహిళా మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మెప్మా సీఎంఎం కేఈవీ బసవేశ్వరరావు, సీఓలు, ఆర్‌పీలు, ఎస్‌ఎల్‌ఎఫ్ ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ



గుడివాడ టౌన్: ప్రజలకు సేవలందించే విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక 14, 15 వార్డు సచివాలయాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్మిన్‌లు, ఎమినిటీస్, ఉమెన్ ప్రొటక్షన్ సెక్రటరీలతో మాట్లాడారు. పట్టణంలో ఆస్తిపన్ను, నీటిపన్ను బకాయిలు పెరిగిపోయాయని హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లు జరగాల్సి ఉందన్నారు. వాటిని వేగవంతం చేస్తూ ప్రతి ఒక్కరూ బకాయిల వసూళ్లలో భాగస్వాములు కావాలన్నారు.

వర్షపు జల్లులకు బెంబేలెత్తిన రైతులు



ధాన్యం సంరక్షణ చర్యల్లో రైతులు

మొవ్వ: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షాలకు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. మండలంలో యంత్రాలపై నూర్చిన దాన్యం బస్తాలు, ధాన్యం రాశులు వర్షానికి తడిసిపోతాయేమో అన్న భయం రైతుల్లో నెలకొంది. ఈ దశలో బస్తాలపై పరదాలు కప్పుకొని తాత్కాలిక ఉపశమనం పొందారు. ఇలా ఉండగా వాతావరణం మేఘావృతమై ఉండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు.

తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించండి



గుడ్లవల్లేరు: ప్రభుత్వ పాఠశాలలపై ఆసక్తి పెంచేందుకు డిసెంబరు 7న నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌లో తల్లిదండ్రులకు ఆటపాటల పోటీలను నిర్వహించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి జి.రమేష్ అన్నారు. ఈ విషయమై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎమ్‌లకు ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, సీఆర్‌ఎంటీలు మాధవరావు, పరమేశ్వరరావు, నాగరాజు, హెచ్‌ఎంలు ఉన్నారు.

శాంతి భద్రతలు అదుపులో ఉండాలి



పామర్రు (తోట్లవల్లూరు): శాంతి భద్రతలు ఎప్పుడూ అదుపులో ఉంచుకోవాలని కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు అన్నారు. తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా స్టేషన్‌లోని రికార్డులను, రిజిష్టర్లను, స్టేషన్ పరిధిలో ఉన్న క్రైమ్‌రేటు తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐకు సూచించారు. మండల పరిధిలో ఉన్న క్రైమ్‌రేటు మరింతగా తగ్గే విధంగా చూడాలని ఆదేశించారు. గ్రామాలలో నిఘా పెంచాలన్నారు. సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవులపై ఆంక్షలు తగదు

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయుల సెలవులపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం తగదని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కృపాకర్ అన్నారు. సంఘ సమావేశం శుక్రవారం ముదినేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు అత్యవసర, ఆరోగ్య కారణాలతో సాధారణ సెలవులు వినియోగించుకోకుండా ఆంక్షలు విధించడం తగదన్నారు. దీనివల్ల మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణకు చేరువలో ఉన్నవారు అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. వెంటనే సెలవులపై ఉన్న ఆంక్షలు తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, హరిబాబు, రమేష్‌బాబు పాల్గొన్నారు.